(సీరియల్ కథ)

# సుడిగాలిలో...... దీపం!



★

రచన :

* శ్రీ బుద్ధిరాజు నరసింహారావు *

(గత సంచిక తరువాయి)

శాంతమ్మ ఆమెని దగ్గరగా తీసుకుంటూ అంది,

"చూడమ్మా...నా దగ్గర దాచే అవసరం నీకేం లేదు. నిజం చెప్పు నాకు నీ బాధ తెలుసమ్మా. మీ ఇంట్లో నీకు ఎదురౌతున్న పరిస్థితులను నేనర్థం చేసుకున్నాను, చెప్పు...ఈ రోజేమయింది?"

అంతవరకూ మౌనంగా వింటున్న రజనీకాంత్ వుండలేక "నిజం చెప్పు ఏమయింది?"

"పిన్నీ...అమ్మ నాకు అన్నమే పెట్టలేదు." లోన దాగివున్న బాధ ఆపుకోలేక భోరుమని ఏడ్చింది.

"ఏమిటీ?" కాంతమ్మ దిగ్భ్రాంతి చెందుతూ, "ఇంతకీ ఏం జరిగింది?" అంది.

"అమ్మ మాట ప్రకారం నేను అన్నం పులుసు చేసి మేడమీద కూర్చుని చదువుకోసాగాను. అంతలో క్రింద నుండి పొయ్యి మీద పప్పు చూడమని చెప్పి అమ్మ పొరుగింటి చందన దగ్గరకు వెళ్ళి పోయింది. నేను లెక్కల్లో పడి ఆమాటే మరచిపోయాను. చివరకు అతికష్టంమీద లెక్కలు కుదిరేసరికి సంతోష పడ్డాను. అంతలో అమ్మ చేత బెత్తం పట్టుకుని కోపోద్రేకంతో కంపించిపోతూ అక్కడికి వచ్చి నన్ను కొట్టింది. పొయ్యి మీద పప్పు మాడిపోయిన ఫలితంగా శిక్షవిధిస్తూ ఈ రోజు నాకు అన్నం లేదు పొమ్మంది, నన్ను బయటకు తోసి తలుపుకి తాళం వేసుకుని అమ్మ ఏదో పని మీద వెళ్ళిపోయింది."

రజనీకాంత్ లోలోన బాధ పడ్డాడు. దీని తల్లిపై అమితమైన అసహ్యం చెలరేగింది.

కాంతమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. ఆవిడ తల నిమురుతూ ఆప్యాయంగా, "ఏడ్వకమ్మా ఏడ్వకు...పద భోజనం చేద్దువు గాని."

"వద్దు పిన్ని...అమ్మ..."

"లేలే...నా మాట కాదనకు."

రజనీకాంత్ లేచి ఆమె చేయి పట్టుకుని, "పద భోంచేద్దువు గాని. లేకపోతే నీతో నేనసలు మాట్లాడను."

దీప అయిష్టంగా లేచి నిల్చుంది.

◆ ◆ ◆

భోజనం చేసి రజనీకాంత్ దీప పెరట్లో నూతి గట్టు మీద కూర్చున్నారు.

మౌనంగా వుండటం గమనించి, "దీపా, వారానికి రెండుసార్లు మీ అమ్మ ఎక్కడికి వెళ్తూ వుంటుందో నీకు తెలుసా?" అన్నాడు.

"పోనీ లేదు...ఎక్కడికి వెళ్తే నాకేం?"

"నేను చెప్తా విను. అమ్మానాన్నా చెప్పుకుంటూ వుంటే విన్నాను. మీ పొరుగింటి చందనం వుందికదా? ఆవిడతో కలిసి మ్యాటనీ షో సినిమాకి వెళ్తూ వుంటుంది."

"వెళ్ళనీ...నాకేం?"

"నువ్వెప్పుడైనా సినిమా చూసావా?"

"లేదు. సినిమాలు చూస్తే పిల్లలు పాడై పోతారంటారు నాన్నగారు."

"మంచి సినిమాలు వస్తే అమ్మా నాన్నతో నేను కూడా వెళ్తూ వుంటాను."

"అన్నట్లు నాకు కాస్త ఇంగ్లీషు చెప్పి పెడ్తావా?"

"తప్పకుండా ఇందాకట్లే నీకేవో లెక్కలు రాలేదన్నావు. నేను చేసి చూపిస్తాను. మీ నాన్నగార్ని చెప్పమన లేక పోయావా?"

"నాన్నగార్నడుగుతే తీరిక లేదు పొమ్మని కసిరి కొట్టారు!"

రజనీకాంత్‌కి కోపం వచ్చింది, "హుం! నీకు లెక్కలు చెప్పడానికి తీరికలేదు. అర్ధరాత్రి దాకా అకిల్లీ కొట్టు కంభూగాడి వద్ద కూర్చుని సారాత్రాగడానికి తీరికుంటేం?"

"సారా ఏమిటి కాంత్"

"పిచ్చిదానా, సారా అంటే ఏమిటో నీకు తెలియదా సారా విషం లాంటిది. అది త్రాగుతే నిషావస్తుంది. సారా చాలా చెడుదని మా నాన్నగారు చెబుతూ వుంటారు. అది త్రాగకూడదు."

"త్రాగుతే చచ్చి పోతారా?"

"అవును."

"కాంత్ నాకో చిన్నపని చేసిపెడ్తావా?"

"ఏమిటి?"

"నాకోసమని సారా తెచ్చిపెట్టు నాకూ చచ్చి పోవాలని వుంది. నాన్నగారి దెబ్బలు నేను సహించలేక పోతున్నాను."

"వోర్నాయనో"

"నాకు చచ్చిపోవాలనుంది."

రజనీకాంత్ ఆవేశంగా ఆమె చెంప ఛెళ్ళు మనిపించాడు. దీప వెక్కివెక్కి ఏడ్చింది. కొద్ది క్షణాలకు తేరుకుని రజనీకాంత్ మృదువుగా అన్నాడు. "దీపా కోపం తెచ్చుకోకు. జీవితంలో ఓడిపోయి ఎన్నడూ ఆత్మహత్య చేసుకోకూడదని నాన్నగారెవరికో చెప్పారు."

"నన్నెవరూ రక్షించలేరు, ఎవరూ రక్షించలేరు." దీప చేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తూనే వుంది.

* * *

దీప ఉలిక్కి పడింది.

బయట ఎక్కడో పెద్దగా పిడుగు పడినట్లుంది. ఆ శబ్దానికే ఆమె స్వప్నం తునాతునకలైంది.

ఆమె పరుపుపై ఒత్తిగిలి పడుకుంది. కాని నిద్ర వస్తేగా? హృదయంలో తుఫాను చెలరేగుతుంటే నిద్రెలా వస్తుంది?

అబ్బ! ఆరోజులు తలచుకుంటేనే భయమేస్తుంది. ఆ రోజులు అనుక్షణం తనెంత బాధకు గురయింది. అతి కష్టం మీద రోజులు గడిచేవి. భరించలేని మనో వేదన.

ఆ బాధలు భరించలేక తనెన్నోసార్లు నిరాశ చెందింది. ఆత్మహత్య చేసుకోవాలనే కోరికకూడా ఎన్నోసార్లు తలెత్తింది. కాని అలాంటి నిర్ణయం తీసుకున్నప్పుడు రజనీకాంత్ రూపమే ఎదురుగా ప్రత్యక్షమయ్యేది "జీవితంలో ఓడిపోయి ఎన్నడూ ఆత్మహత్య చేసుకోకూడదు" అన్నమాట గుర్తొచ్చేది.

ఆ సమయాలలో ఎంతగానో ఏడుపొచ్చేది. నేనేం చేసేది. నాకు ముక్తి మార్గం ఏమిటి?

రోజులు గడిచాయి.

ఆ తర్వాత కొద్దిరోజులకి తన కష్టాలు అంతమౌతాయనుకుంది, కాని ప్రయోజనం లేక పోయింది. అది తన భ్రమగా తేలిపోయింది.

అమ్మ చనిపోయింది. కొన్ని నెలలు కేన్సర్‌తో బాధపడి చివరికి మృతి చెందింది.

చంద్రయ్య పూర్వం మాదిరిగానే అంతులేని బాధకు గురయ్యాడు. అప్పటికి రత్తమ్మ కడుపున పుట్టిన పువ్వు వయసు రెండు సంవత్సరాలు.

పువ్వంటే చంద్రయ్యకు పంచ ప్రాణాలు. ఇరుగు పొరుగు వారు ఎంతగానో నచ్చచెప్పగా చంద్రయ్య కోలుకో గలిగాడు. లేకపోతే సారా అలవాటుతో తప్పకుండా ఆత్మహత్య చేసుకుని వుండేవాడు.

ఆ రోజుల్లోనే రజనీకాంత్ తండ్రి శ్రీకాంత్‌కి బదిలీ అయిపోయింది. ఆయన పరివార సమేతంగా రాంచీ వెళ్ళిపోయాడు.

దీపకి జీవితంలో ఆనంద భరితమైన ఆ కొద్ది క్షణాలు కూడా గూరమైనాయి.

దీప హైయ్యర్ సెకండరీ ప్యాసయింది.

అప్పటికి దీప చెల్లెలు పుష్ప ఎనిమిదవ తరగతి దాటింది.

అప్పుడే తండ్రి చంద్రయ్య దీపకి త్వరలో వివాహం చేసి పంపెద్దామనుకున్నాడు.

వరుడికై గాలించసాగాడు. కట్నం కానుకలూ పుచ్చుకోని వరుడు నలుగురు పిల్లల తండ్రి, జబ్బువాడైనా సరే ఊం అనడానికి సిద్ధంగా వున్నాడతను.

ఆ నాడు దీప తండ్రితో అన్నది, "నాన్నా నాకు పెళ్ళి చెయ్యవద్దు నేను కాలేజీలో చదువుకుంటాను నా కాళ్ళమీద నిలబడి"

"హుం!...సిగ్గులేక పోతేసరి నోరుమూసుకుని పడి వుండు. నీ పెళ్ళి జరిగితీరుతుంది!" తండ్రి స్వరంలో కఠోరత్వం ధ్వనించింది.

దీపకి నోటవెంట మాట పెగల్లేదు. ఎలాగో నిగ్రహించుకుని, "పెళ్ళి చేసుకుంటాను. కాని చదువు కోక పోయినా టైపూ షార్ట్‌హేండు నేర్చుకోనీయండి."

"వీల్లేదు...!" ఖచ్చితంగా అనితండ్రి గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం సుందరం బాబాయ్ వచ్చాడు. ఆయన చంద్రయ్యకి మంచి మిత్రుడు. ఆఫీసులో చంద్రయ్యకంటే సీనియర్ కాబట్టి ఆయనంటే చంద్రయ్య కాస్త జడుసుకుంటాడు. చంద్రయ్య పోస్టాఫీసు ఉద్యోగం లోంచి రిటైర్ అయ్యాక సుందరమే అతనికి తన ఆఫీసులో ఆ ఉద్యోగం వేయించాడు. అందుకే సుందరమంటే అతనికి మంచి గురి కూడా ఉంది.

ఆ సాయంత్రం దీప వెక్కి వెక్కి ఏడుస్తూ సుందరం బాబాయికి తన సమస్య చెప్పింది.

అంతా విని ఆయన అభయమిస్తూ ఓదార్చాడు.

ఆమె అనుకున్నట్లే తండ్రి అంగీకరించాడు. ఆ మర్నాడు నుండే ఆమె టైపు షార్ట్‌హేండు నేర్చుకోవడం ప్రారంభించింది. కష్టం ఫలించింది. ఎనిమిది నెలల్లో ఆ కోర్సు పూర్తి చేసింది.

C.K.C

ELEPHANT BRAND




Carnataka Knitting Co.

TIRUPUR - 638 602.

★

Sales depot:

No. 4-6-213, PAN BAZAAR,

SECUNDERABAD - 500 003.

ఆ తర్వాత తండ్రి మళ్ళా పెళ్ళి ప్రయత్నాలు చేయసాగాడు. దీప అప్పుడే పెళ్ళి వద్దంది. కాని తండ్రి ఒప్పుకోలేదు.

నిరాశ చెంది ఆమె మళ్ళా సుందరం బాబాయిని వేడుకుంది. కాని ఈసారి ఆయన కూడా కోప్పడ్డాడు, "చూడమ్మాయి పెళ్ళి చేసేదానికి ఓ వయసంటూ వుంటుంది. ఆ వయసు దాటి పోయాక బాధ పడవలసి వుంటుంది. నీకు ఉద్యోగం చేయాలని వుంది కదూ? నీపై నువ్వు ఆధారపడాలనే కదా నీ ఆకాంక్ష? నీకు కాబోయే భర్త కూడా నీ ఆకాంక్షని వ్యతిరేకించని వాడిగా చూసే బాధ్యత నాది. నువ్వేం బాధపడకు"

మరి దీప ఏమీ అనలేక పోయింది.

చంద్రయ్యా, సుందరం కలిసి వరుడికై గాలించసాగాడు. ఆకస్మాత్తుగా అదృష్టం కలిసి ఆధునిక సభ్యతలో పెరిగి పెద్దవాడైన ఓ యువకుడు కమల్‌ని పొందగలిగారు.

కమల్ ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్, విజయ నగరంలో పుట్టి పెరిగినా అతను ఉద్యోగం చేసేది సునాబేడాలో, అతనెంతో చలాకీగల యువకుడు, మూఢ నమ్మకాలంటే అతనికి గిట్టదు.

ఆ సంబంధం కుదిరే సరికి చంద్రయ్య తగ్గుస్థాయిలో "బాబూ కట్నం..."

"చూడండీ కట్నాలు కానుకలూ అంటే మీకు చాలా మంది యువకులు దొరుకుతారు. వెళ్ళొచ్చు. నాకు కట్నాలూ వద్దు, కానుకలూ వద్దు!"

అంతకన్నా చంద్రయ్యకు కావలసిన దేమిటి?

* * *

ఆరోజు ... ఆదివారం!

ఉదయం తొమ్మిదయి ఉంటుంది.

ఇంటి బయట మంచం మీద కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాడు చంద్రయ్య. అతని ప్రక్కనే సుందరం కూర్చున్నాడు.

ఇద్దరూ సంభాషించుకుంటున్నారు.

"ఇంతకీ ఏమన్నాడు కమల్?" సుందరం అడిగాడు.

"ఏమో బాబు!.. అతని మాటలు నాకర్థం కావు ఏవో పిచ్చి మాటలు. సాధారణంగా చూడడానికి అందమైన వాడు, తెలివి తేటలు గలవాడిగా కనిపిస్తాడు కాని అతని మనోభావాలు మాత్రం నాకు అంతు పట్టడం లేదు. దీపని అతనో సారి క్లైపు ఇన్‌స్టిట్యూట్‌లో

చిరకాల మన్నిక - అతిప్రకాశవంతమైనది - నవీన పనితనము!

నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు,
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మా వద్ద దొరుకును
మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.




: తయారించువారు :

Phone No. 27468

NOVEL DIAMOND WORKS

WEST RANI STREET, : : TIRUCHIRAPALLI-620 008

చూసాడుట. దీప తనికి వచ్చిందట. అతని తండ్రి అతని భావాలతో ఏకీభవిస్తే ...నిజంగా నాకు మతి పోయింద నుకో. అం...అతని తల్లి మాత్రం పూజలూ పునస్కారాలు చేసే మనిషిలావుంది. అందుకు నాపక్షంలో మాట్లాడింది."

"ఇంతకీ అతనేమన్నాడు?"

"బాజా భజంత్రీలతో ఆడంబరంగా పెళ్ళి చేసుకోవడం తన కిష్టం లేదు. బ్రాహ్మణులూ వద్దు, దానాలూ ధర్మాలూ, భోజనాల ఖర్చూ వద్దు. ఎటువంటి ఆడంభరం లేకుండా రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి పెళ్ళి చేసుకుంటా నంటాడు."

"అయితే నువ్వేమన్నావు?"

"అదెలా సాధ్య పడుతుంది? మన పూర్వీకులు నిర్వహించిన నియమాలను పాటించడం మన కర్తవ్యమని నచ్చ చెప్పాను."

సుందరం పెదవుల పై చిరునవ్వు చిందులాడింది, "కమల్ అన్నమాటల్లో తప్పులేదే?"

"హరేరామ హరేరామ ఏమిటి సుందరం నువ్వనేది. మన బ్రాహ్మణకుటుంబాలలో అలా జరుగుతూ వుంటే చూస్తూ ఊరుకోవడమేనా? అనడానికి ఇది ఆధునిక కాలమే కాని ఈ ఆధునిక వివరాలూ, చేష్టలూ నాకసలర్థం కావు. అబ్బ పేరు బడ్డ సాధువులని పండితులని ఆరాధించి పూజించడంలో వున్న ఆనందం ఈ ఆధునిక యువకులకేం తెలుసు? బ్రాహ్మణుల మాట కాదని, వ్యతిరేకించి వారి శాపం పొందితే మరేమయినా వుందా?" చంద్రయ్య ఆవేశంగా అన్నాడు.

సుందరం వదనం గంభీరంగా మారింది, "నువ్వే మనుకో కాని నాకీ ఆధునిక ఆలోచనలు ఎంతగానో నచ్చుతాయి".

"అయితే నువ్వుకూడా ఆ యువకుని పక్షంగానే మాట్లాడుతున్నావన్న మాట. నేనుకూడా స్పష్టంగా చెప్పాను సుమా పెళ్ళి చేసుకుంటే మనరీతిలోనే అని."

"నీకు మతి పోయిందేమిటి? కమల్ అణి ముత్యం లాంటి వాడు అలాంటి మంచి యువకుడు నీకు మరెన్నడూ దొరకబోడు!"

"నిజంగా నాకు మతి పోతున్నది."

"చూడు సుందరం అందరూ కులం మతం ధర్మం అంటూ గోల పెడతారు...కాని వీటి వెనక దాగివున్న సత్యాన్ని ఇప్పటికీ ఎవరూ అర్థం చేసుకోలేదు; ఆనాడు సీతాపురంలో అయిన పోరాటాలు నీకు గుర్తున్నాయా, రెండు మతాలవాళ్ళు పోరాటాలకి దిగి ఎంతమందో యువకులను హతమార్చారు. ఎందరినో అగ్నిలో నిలువెల్లా కాల్చి పారేసారు, అందులోనే నా భార్యా ఇద్దరు పిల్లలూ బలి అయినారు. ఈ పోరాటాలు ఎందుకు? అన్ని ధర్మాల వెనకాల దాగి వున్న సత్యమేమిటో నీకు తెలుసా?"

"ఏమిటి?"

"జాతి, కులం, మతం ధర్మం ఏదయినా ఎవరు ఏ జాతికీ ఏ ధర్మానికి చెందిన వారైనా సరే అందరూ అవలంబించ వలసిన మార్గం ఒక్కటే. దాన్నే ప్రేమ, మానవత్వం, సహకారం అంటారు. అందరూ మానవులే అందరి శరీరాల్లో ప్రవహించేది ఎర్రని రుధిరమే ఎందుకు మరి ఈ అలజడులు? మానవులు శాంతంగా ఎందుకాలోచించరు?" సుందరం అలసిపోయినట్లు అతని వైపు చూసాడు.

"లెక్చర్లు చాలా ఇయ్య వచ్చు కాని వాటిపై ఆచరించడం ఎంతో కష్టం. అంటే నువ్వనేది నీకు సాధువులపై పండితులపై నమ్మకం లేదన్న మాట?"

"సాధువులూ, మహాత్ములూ లేరనికాదు నేననేది. కాని ఈ కాలంలో వారి రూపాలు దాల్చి మానవులను మూర్ఖులుగా మార్చి, ధర్మం పేరుతో భయపెట్టి దోచుకుంటున్న వారే అధికంగా కనిపిస్తున్నారు. అంతేగాని పూర్వీకులులా అన్ని కోరికలను త్యజించి, మానవత్వానికి విలువనిచ్చే వారు మాత్రం నా కంటికి కనబడటం లేదు."

"నేను ఆరాధించే బాబా ఎవరో నీకు తెలుసుకదా? ఫలాహారి బాబా భోలానాథుడు. ఆయనంటే కూడా నీకు సదభిప్రాయం లేదా? ఆయన చుట్టూ గుమిగూడి వున్న ప్రజలూ, శిష్యులూ మూర్ఖులా? బాబా ఆజ్ఞతో, ఆయన చమత్కారాలతో ప్రతీఇంటా భగవద్గీత మీద విభూతి నిలవలేదా? ఎంతో మంది శాపగ్రస్తులైన స్త్రీలు తల్లులు కాలేదా? ఆయన భగవానుని అవతారం కాదా?"

(సశేషం)